## క్లుప్తంగా

### పూజల్లో పాల్గొన్న ప్రభుత్వవిప్



స్వామివారిని దర్శించుకుంటున్న కొరముట్ల

**ఓబులవారిపల్లె :** మండలంలోని సిరిగిరాచపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో గణపతి బలిపీఠ ప్రతిష్ట కార్యక్రమంలో శనివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయి కిషోర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించి, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్‌రాజు, డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరీశంకర్‌రాజు, ఉప సర్పంచ్ కేశవ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణల తొలగింపు



పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**పుల్లంపేట :** మండల కేంద్రంలోని చిట్వేలికి వెళ్లే రహదారి ఆక్రమణలకు గురికావడంతో శనివారం తహసీల్దార్ నరసింహకుమార్, రాజంపేట టౌన్ సీఐ నరసింహారావుల ఆధ్వర్యంలో కొంతమేర ఆక్రమణలు శనివారం తొలగించారు. ఆక్రమణలు తొలగిపోవడంతో చిట్వేలికి వెళ్లే రహదారి విశాలంగా ఉంటూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోయింది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రక్తదాన శిబిరం విజయవంతం

**చిట్వేలి :** మండల కేంద్రంలోని ఫిట్‌నెస్ జిమ్ రెండో వార్షికోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీల సహకారంతో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. చిట్వేలి స్వచ్ఛంద సంస్థలు, ఖున్ కా రిస్తా కడప బ్లడ్ బ్యాంక్ సభ్యుల సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 45 మంది రక్తదాతలు పాల్గొని రక్తాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, గాడి ఇంతియాజ్ అహ్మద్, జిమ్ నిర్వాహకులు, బాబు, నాగేశ్వరరావు, మానవత సభ్యులు చైర్మన్ సురేంద్రరెడ్డి, సాయిరాం, మునిరావు, రంగారెడ్డి, నవీన్, హజరత్, రమణారెడ్డి, సువారపు హరిప్రసాద్, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ

**గాలివీడు :** మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పిల్లి నాగరాజు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు శనివారం మెనూ ప్రకారం భోజనంతో పాటు స్వీటు, రాగి సంగటి, మజ్జిగ, రసం, పప్పు అందించారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా ఎప్పటికప్పుడు తాజా కూరగాయాలతో మధ్యాహ్నం భోజనం వండాలని వంట ఏజెన్సీకి సూచించారు. విద్యార్థులు రాత నైపుణ్యం మరింత మెరుగు పరుచుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. సిలబస్ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు.

### కుష్టు వ్యాధిపై అవగాహన ఉండాలి

**రాయచోటి అర్బన్ :** ప్రతి ఒక్కరికి కుష్టువ్యాధిపై అవగాహన అవసరమని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి అన్నారు. శనివారం రాయచోటి రూరల్ మండలం మాధవరం – 2 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ పరిధిలోని కాల్వపల్లెలో ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి ఎలా వస్తుంది ? నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడవలసిన మందుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వైద్యసిబ్బంది గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్తుడి పాదాలకు ఉన్న పుండ్లను హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో శుభ్రం చేసి పోవైడిన్ పూతపూసి కట్టు కట్టడంతో పాటు మందులు, మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ షహనాజ్, ఏఎన్ఎం శ్రీవిద్య, ఆశ కార్యకర్త గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

### దర్గాలో ఘనంగా గ్యార్మీ ఉత్సవం

**రామాపురం :** మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్బారు సాయినగర్ వద్ద ఉన్న దర్గాలో శనివారం సాయంత్రం మహబూబ్ సుబహానీ గ్యార్మీ జెండా ఉత్సవాన్ని దర్బారు సాయి భక్తులు, నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మొదట దర్గాలో ఫాతెహా సమర్పించారు. అనంతరం జెండా ఉత్సవాన్ని జరిపారు. ఏటా సద్గురు పీఠంలో గ్యార్మీ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు. నిర్వాహకులు సత్యమయ్య, శంకరనారాయణ, దర్బార్, జాఫర్, జాకీర్, నరసింహ, రియాజ్ పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యం



సిద్దవటం: మందుల కిట్‌ను అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి



రాయచోటి అర్బన్: సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు



చిట్వేలి: వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

**రాయచోటి అర్బన్ :** జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే వైద్యం అందుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని భట్టు వీధి సచివాలయం పరిధిలోని ప్రజలకు, ఇతర ప్రాంతాలకు ప్రజలకు బండ్లపెంట దర్గా సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్యలతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గడప గడప వద్దకు ప్రభుత్వం వైద్యం తీసుకెళుతోందన్నారు. పేదలందరికి హక్కుగా ఆరోగ్యంను కల్పిస్తోందని, అనారోగ్య పీడితులను చేయిపట్టుకుని ప్రభుత్వం ముందుకు నడిపిస్తోందన్నారు. ఐదు అంచెలలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులు, పిల్లలు, యువత తదితరుల ఆరోగ్య అవసరాలను గుర్తించి వాటిని కచ్చితంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్లెలు, కాలనీలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు స్పెషలిస్టు వైద్యులు వచ్చి వైద్యం చేయడం రాష్ట్రంలో మునుపెన్నడూ చూడలేదన్నారు. నాడు–నేడు ద్వారా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. నాలుగేళ్ళ పాలనలో ప్రభుత్వం కేవలం వైద్యానికే రూ.3600 కోట్లకు పైగా ఖర్చుపెట్టినట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగంలో జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు చెప్పారు.

**74 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు**

రాయచోటి నియోజకవర్గంలో నేటి వరకు 74 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించినట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. 31,495 మంది ఓపీ సేవలను వినియోగించుకున్నారన్నారు. చికిత్సలు, శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు సిఫారసు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, సాదిక్ అలీ, అన్నా సలీం, షబ్బీర్, గౌస్‌ఖాన్, అల్తాఫ్, రియాజ్, సుగవాసి శ్యామ్, విజయభాస్కర్, హజరత్ ఖాదర్‌వలీ, కొత్తిమీర ప్రసాద్, విక్కీ దేవేంద్ర, జావీద్, ఆమీర్, ఏ.వి.రమణ, జమాల్, వైద్యాధికారులు జియావుల్లా, విష్ణువర్ధన్‌రెడ్డి, భానుప్రకాష్, నీలోఫర్, హేమంత్‌కుమార్, శ్వేతలు పాల్గొన్నారు.

**అందరికీ ఆరోగ్యం.. జగనన్న సురక్ష లక్ష్యం**

**చిట్వేలి :** గడప గడపకు వెళ్లి అందరికీ ఆరోగ్యాన్ని అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాజుకుంట ఆరోగ్య ఉపకేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు అబ్దుల్ అన్సారీ, సల్మాతోపాటు అదనపు వైద్యులు ఓబులేసు (కన్ను), మొహర్ (డీజీఓ), లిఖిత (జనరల్) రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేయడంతోపాటు రోగులందరికీ అవసరమైన మందులను పంపిణీ చేశారు. గ్రామంలోకి వచ్చి వైద్య శిబిరం నిర్వహించి అందరికీ ఆరోగ్య సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, మాదినేని, ఎంపీడీఓ శివరామిరెడ్డి, కనకరాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, ఆరోగ్య విస్తరణాధికారి విజయ్ కుమార్, ఏఎన్ఎం ఫరిదా, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**ప్రజల వద్దకే వైద్య సేవలు**

**సిద్దవటం :** ప్రజల వద్దకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సర్పంచ్ తుర్రా చిన్నక్క అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు 530 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం ఒక చారిత్రాత్మక నిర్ణయమన్నారు. సిద్దవటం మండలంలోని 10 గ్రామ సచివాలయాల్లోని ప్రజల స్మార్ట్ ఫోన్‌లలో ఆయా వలంటీర్లు ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడు చేయించాలన్నారు. అనంతరం ఆయన రోగులకు మందుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దారు లక్ష్మీదేవి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు తుర్రా ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, వీఆర్‌ఓ నాని, వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట

**రాజంపేట టౌన్ :** మండలంలోని ధనాసపల్లెలో శనివారం అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పెద్దఎత్తున ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో మూడు రోజులపాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలను జరిపారు. అందులో భాగంగా నిత్యం హోమాలు, అమ్మవారికి విశేష పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ట రోజున పోతురాజును యువకులు గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. అలాగే యువకులు తప్పెట్ల వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొనడంతో ధనాసపల్లెలో సందడి వాతావరణం నెలకొంది.

### ఆలయ తలుపులు మూసివేత

**రాయచోటి టౌన్ :** చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ తలుపులు మూసివేస్తున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిలు తెలిపారు. శనివారం రాత్రి అశ్వినీ నక్షత్ర యుక్త రాహుకాల పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా సాయంత్రం 6:30 గంటల నుంచి ఆదివారం ఉదయం 4:30 గంటల వరకు ఆలయ తలుపులు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయం శుద్ధి చేసి, సంప్రోక్షణ తరువాత ఆదివారం ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి దర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో త్రేతేశ్వరుడి గిరి ప్రదక్షిణ



త్రేతేశ్వరుడి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

**రాజంపేట రూరల్ :** శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామికి భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. మండల పరిధిలోని అత్తిరాలలో శనివారం సాయంత్రం 6 గంటలకు గిరి ప్రదక్షిణను కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో త్రేతేశ్వరుడికి మొక్కులు చెల్లించి ప్రారంభించారు. 'హరహర మహదేవ శంభో శంకర ' నామస్మరణతో అత్తిరాల పరిసరాలలో శివనామస్మరణ హోరెత్తింది. కామాక్షి మాతను, త్రేతేశ్వరుడిని ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చారు. స్వామి వారి పల్లకీని భక్తులు మోస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ చేపట్టిన కార్యక్రమం శ్రీవినాయకస్వామి గుడి వద్దకు చేరుకోగానే రవి ఆచారి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు యూపీ రాయుడు అన్నప్రసాదాన్ని, శ్రీచక్ర హైస్కూల్ ఎండీ రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి అంజని ప్రియదర్శిని

**ఓబులవారిపల్లె :** చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జీ అంజని ప్రియదర్శిని పేర్కొన్నారు. శనివారం సంజీవపురం సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం వలన కలిగే అనర్థాలు, మోటార్ వెహికల్ చట్టం, యాంటీ ర్యాగింగ్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిసై వారి భవిష్యత్తును నాశనం చేసుకోరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమతో ఖరీదైన వాహనాలు కొనిచ్చి వారు నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మన్సూర్ అలీ, న్యాయవాదులు ఎం.శంకరయ్య, ఎం.సురేష్ రెడ్డి, రమణయ్య, అంబిక, భ్రమరాంబ పాల్గొన్నారు.

## కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి

**రాజంపేట :** ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజరు గుండాల రమణయ్య అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కార్గో సేవలలో ఆర్టీసీ మెరుగైన సేవలందిస్తోందన్నారు. కార్గో పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఈ నెల 26 నుంచి వచ్చే నెల 25 వరకు డోర్ డెలవరీ పార్సిల్ మాసోత్సవం నిర్వహిస్తోందని తెలిపారు. దాసరి కృష్ణమూర్తి, మోడపోతుల రమణయ్య పాల్గొన్నారు.

### సకాలంలో ఎరువులు అందించాలి

**లక్కిరెడ్డిపల్లె :** రబీ సీజన్‌కు సంబంధించిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని వ్యవసాయ అధికారి రమేష్ బాబురావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని దప్పేపల్లి, ఎర్రగుడి, అనంతపురం రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ రబీ సీజన్‌కు సంబంధించిన ఎరువులు, యూరియా, డీఏపీ, మిక్సర్, ఎంఓపీ, సూపర్ ఎరువులు ప్రతి ఆర్‌బీకే కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలియజేసి ఎరువులు అందించాలన్నారు. అలాగే 2023వ సంవత్సరంలో పంట సాగుచేసే ప్రతి రైతు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతుల సామాజిక జాబితాను ఆర్‌బీకేలలో బోర్డులు ఏర్పాటు చేసి రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీటీఎం రమేష్ రెడ్డి, వీఏఏ నాగరాజు, హరితలు పాల్గొన్నారు.

### కృత్రిమ చేతుల కోసం సంప్రదించండి

**రాయచోటి టౌన్ :** కృత్రిమ చేతులు అవసరత ఉన్నవారు సంప్రదించాలని ఎల్లెన్ మెడోస్ ప్రొస్తెటిక్ హ్యాండ్ ఫౌండేషన్ వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎల్లెన్ మెడోస్ ప్రొస్తెటిక్ హ్యాండ్ ఫౌండేషన్, మంగళగిరి రోటరీ క్లబ్ వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధునాతనంగా ఉండటంతో పాటు తేలికగా ఉండటంతో పాటు సులభంగా ధరించగలిగేలా ఉన్న కృత్రిమ చేతులను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. భుజం నుంచి నాలుగు అంగుళాలు ఉన్న వారు మాత్రమే వీటికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు 7207403150కు ఫోన్ చేయవల్సిందిగా కోరారు. మరింత సమాచారం కోసం సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ వైఎస్సార్ జిల్లా, అన్నమయ్య జిల్లా అధికారులను సంప్రదించాలని కోరారు.

## సమస్యలకు పరిష్కార వేదికలు 'సచివాలయాలు'



కొరముట్ల, అజయ్‌రెడ్డిలను సత్కరిస్తున్న గ్రామస్తులు

**పెనగలూరు :** గ్రామ సచివాలయాలతో మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల కష్టాలు తీరాయాని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. శనివారం నారాయణనెల్లూరు, నల్లపరెడ్డిపల్లెలోని గ్రామ సచివాలయం, రైతు భరోసా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ద్వారా సహకారం అందిందని వారు తెలియజేశారు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే గ్రామీణ ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలు, రైతులకు రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఏర్పాటు చేశారన్నారు. గతంలో మారుమూల గ్రామాల ప్రజలు ఎలాంటి పనులు ఉన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, సచివాలయాల ఏర్పాటు ద్వారా అలాంటి సమస్యలు తీరిపోయాయన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఎరువులు, పురుగు మందులు కావాలంటే రాజంపేట, మండల కేంద్రానికి వెళ్లి తీసుకోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు సరఫరా అయ్యేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారన్నారు. నారాయణ నెల్లూరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, వెంకటరెడ్డి, సానారెడ్డిలు భవనాలను త్వరితగతిన నిర్మించి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారన్నారు. అనంతరం ప్రజల సమస్యలు విని సంబంధిత శాఖల అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని తెలియజేశారు. కార్యక్రమంలో నారాయణ నెల్లూరు సర్పంచ్ కేతా చక్రపాణి, కోమంతరాజుపురం సర్పంచ్ రాజమ్మ, నల్లపరెడ్డిపల్లి ఎంపీటీసీ బి.రోశయ్య, ఎంపీడీఓ వరప్రసాద్, పీఆర్ డీఈ బాల నరసింహులు, పీఆర్ ఏఈ గంగులయ్య, డీటీ మురళీకృష్ణ, వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షుడు పంజం సుకుమార్ రెడ్డి, మండలాధ్యక్షులు సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య చికిత్సలు

**నందలూరు (రాజంపేట) :** డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా సంవత్సరానికి ఐదు లక్షల వరకు ఉచిత ఆరోగ్య చికిత్సలు చేయించుకోవచ్చని వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగ ప్రధాన కార్యదర్శి గీతాల నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నల్లతిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గీతాల శిరీషా ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సంరక్షణ పథకం ద్వారా కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనారోగ్యానికి గురైన వారు ఆరోగ్యశ్రీ కార్డులు ఎలా వినియోగించుకోవాలో, ఆరోగ్యశ్రీ యాప్ ఎలా వాడాలో వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భ్రమరాంబిక, ఎంపీటీసీ రామచంద్రయ్య, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



రాయచోటి: వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, వాల్మీకులు, నాయకులు



రాజంపేట రూరల్: వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా, వాల్మీకులు

**రాయచోటి :** సామాన్య ధర్మాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమాజంలో మానవతా విలువలు పెంపొందించడానికి దోహదం చేసిన మహోన్నతుడు శ్రీ వాల్మీకి మహర్షి అని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణం బస్టాండ్ మార్గంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహావిష్కరణ, జయంతి వేడుకలను వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్లతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతారాముల సద్గుణాలను, గొప్పతనాన్ని చెప్పడంతోపాటు ఆదర్శవంతమైన జీవితం, కుటుంబ విలువల నుంచి పాలన సూత్రాల వరకు, సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను తెలియజేసిన మహర్షికి మనమందరం రుణపడి ఉన్నామన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించడం హర్షదాయకమన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్లు గువ్వల లక్ష్మీదేవి, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, రియాజ్, గౌస్ ఖాన్, ఫయాజ్ అహ్మద్, షబ్బీర్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, బీసీ సెల్ విజయభాస్కర్, లక్కిరెడ్డిపల్లె బీసీ నాయకుడు విజయభాస్కర్, జిల్లా విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, గువ్వల జగదీష్, జావీద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

**సిద్దవటం :** మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడకలను ఘనంగా నిర్వహించినట్టు గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలిసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కారణజన్ముడు శ్రీ వాల్మీకి మహర్షి**

**లక్కిరెడ్డిపల్లె :** వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని లక్కిరెడ్డిపల్లెలో బీసీ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్ కుమార్ గురుస్వామి వెంకటరమణ, పి.వెంకటస్వామి, బసయ్య, రవిరాజు, హరి, రమణయ్య, సుబ్బయ్య, కృష్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**రాజంపేటలో..**

**రాజంపేట రూరల్ :** రామాయణంను రచించిన వాల్మీకి మహర్షి దైవాంశ సంభూతుడని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కొనియాడారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద, బోయపాళెంలోనూ శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి వాల్మీకికు ఘనంగా నివాళి అర్పించారు. అదే విధంగా బోయపాళెంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి బీసీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జేవీ కృష్ణారావు, వడ్డే రమణ, గోవిందు బాలకృష్ణ, దండు గోపి, దాసరి పెంచలయ్య, మురళీఆచారి, డి.భాస్కర్‌రాజు, పి.విశ్వనాథరెడ్డి, పి.వేణుగోపాల్‌రెడ్డి, రాంనగర్ ధర్మయ్య, రేపూరి పెంచలయ్య, ఎస్.నాగరాజు, చికెన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి

**చిన్నమండెం :** విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయులకు ఐపీఈ భానుమూర్తిరాజు సూచించారు. చిన్నమండెం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయిని పనితీరు గురించి విద్యార్థుల క్రీడా ప్రతిభ గురించి ఆరా తీశారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు జాతీయ పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇవ్వాలని వారు సూచించారు. విద్యార్థులు శారీరక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యాయామ విద్యా తనిఖీ అధికారులు వెంట ఏపీపీఏటీ అండ్ ఎస్ఈ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు ఉన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

**సిద్దవటం :** ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని అడిషనల్ కమాండెంటు కె. ప్రభుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమాండెంటు శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బెటాలియన్‌లోని కళ్యాణ మండపంలో కడప హోలిస్టిక్ వారి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. బెటాలియన్‌లోని ఆఫీసర్స్, బెటాలియన్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు, చిన్న పిల్లలు మొత్తం 106 మందికి ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ చరిత, దంత వైద్యులు డాక్టర్ పవన్, కార్డియాలజిస్టులు డాక్టర్ శ్రావన్‌కుమార్ ఎండీ, డాక్టర్ నవీన్ అహ్మద్ ఎండీ, జనరల్ మెడిషన్ డాక్టర్ భద్రి మల్లికార్జునప్రసాద్, గైనకాలజిస్టు డాక్టర్ సందా సౌజన్యలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అంతేగాకుండా కడప రిమ్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 39 మంది బెటాలియన్ పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. అసిస్టెంటు కమాండెంటు వి. కేశవరెడ్డి, వి. జయప్రసాద్, వెంకట్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, యూనిట్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.